క్లుప్తంగా

పెద్దలను గౌరవించేలా.. గ్రాండ్ పేరెంట్స్ డే



మంగళగిరి: పిల్లలు పెద్దలను గౌరవించేలా అవగాహన కల్పించేందుకే గ్రాండ్ పేరెంట్స్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్ఞాన సుందరి తెలిపారు. శనివారం మండలంలోని నిర్మల పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు గ్రాండ్ పేరెంట్స్(అమ్మమ్మ, తాతయ్య, నానమ్మ) ఇలా పెద్దల వేషాధరణలో ఆకట్టుకున్నారు. పిల్లలు ఎదిగేటప్పుడు అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మలు చెప్పే మంచి మాటలు భవిష్యత్తుకు ఎంతో ఉపయోపడతాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హాజరైన వృద్ధులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు.

జంగిల్ క్లియరెన్స్



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డు వెంబడి పెరిగిపోయిన మొక్కలను తొలగించేందుకు మంత్రి నారాలోకేష్ తన సొంత నిధులతో ఐదుగురు యువకులను ఏర్పాటు చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులక పేటలోని పలు ప్రాంతాల్లో నివాసాల మధ్య, డ్రెయినేజీల పక్కన పెరిగిన చిన్న చిన్న మొక్కలను యంత్రం సాయంతో లోకేష్ టీమ్ తొలగించింది. ఏ ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరిగితే టీడీపీ కార్యాలయంలో సమాచారం ఇస్తే వెంటనే తొలగిస్తామని పార్టీ నేతలు తెలియజేశారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం




ఫిరంగిపురం: అమీనాబాద్ పంచాయతీ కార్యదర్శిగా ఏకే బాబు గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని సిబ్బంది, గ్రామ నాయకులు అన్నారు. వేములూరిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం బదిలీపై వెళుతున్న కార్యదర్శి ఎ.కిషోర్ బాబును సిబ్బంది, గ్రామ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొరివి ఆనంద్, బి.మధు, కటికల రామకోటేశ్వరరావు, రత్నరాజు, గాంధీ బుడే, సీతారామాంజనేయులు, సయ్యద్ రబ్బాని, ఆరీఫుల్లా, నాగేశ్వరరావు, గోపి, అంకారావు, కె.పాల్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

అమీనాబాద్ పంచాయతీ కార్యదర్శిగా జ్యోత్స్న

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ పంచాయతీ కార్యదర్శిగా అంకాల జ్యోత్స్న శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏకేబాబు బదిలీపై వెళ్లారు. దీంతో జ్యోత్స్న ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది, గ్రామ నాయకులు పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

నవ దుర్గలుగా..



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ఉన్న నాగార్జున పాఠశాలలో శనివారం దసర సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నవదుర్గల అవతారాల్లో ఆకట్టుకున్నారు.

నేడు టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

తెనాలి రూరల్: రాష్ట్ర టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక ఆదివారం ఉదయం జరుగుతుందని ఏపీ యూత్ టీ-20 క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్. భాస్కర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్ ఆవరణలో గల యువ క్రికెట్ అకాడమీలో ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, తెల్ల దుస్తుల్లో సెలక్షన్స్‌కు రావాలని ఆయన సూచించారు. ఎంపికైన జట్టు నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న నేషనల్ టీ-20 క్యాష్ ప్రైజ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. వివరాలకు 7989215572 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మద్యం దుకాణాలకు 14 దరఖాస్తులు

తెనాలి రూరల్: తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో ప్రైవేటు మద్యం దుకాణాల దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తెనాలి టౌన్, తెనాలి మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో మొత్తం 25 దుకాణాలకు తెనాలి కార్యాలయంలో శనివారం 14 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయి. దీంతో ఇప్పటి వరకు మొత్తం 18 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తెలిపారు.

గల్లీ లీడర్ల పెత్తనం

- సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్న టీడీపీ నాయకులు
- చెప్పినట్లు వినకపోతే బదిలీ తప్పదంటూ హెచ్చరికలు
- లీడర్ల ఒత్తిడి తట్టుకోలేక పోతున్న ఉద్యోగులు..
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



రాజీవ్ సెంటర్‌లోని సచివాలయ భవనం


మంగళగిరి: సచివాలయ ఉద్యోగులు టీడీపీ గల్లీ లీడర్ల పెత్తనంతో హడలిపోతున్నారు. తాము చెప్పినట్లు వినాలని, చెప్పిన వారికే పథకాలు వర్తింపజేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. అనర్హులైనా.. సూచించిన వారికి సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని, లేదంటే బదిలీ తప్పదని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇప్పుడు ఇది ఉద్యోగులలో చర్చనీయాంశంగా మారింది. ఓ సచివాలయంలో పని చేస్తున్న మహిళా పోలీస్‌ను గత ప్రభుత్వ పాలనలో తమపై ఫిర్యాదు చేసిందనే ఆగ్రహంతో అచ్చంపేట, క్రోసూరుకు బదిలీ చేయాలంటూ ఈ 'గల్లీ'జు లీడర్లు ఒత్తిడి తీసుకురావడంపై అధికారులు కూడా విస్తుపోతున్నారు. చోటా నేతల ఒత్తిళ్లపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్రస్థాయిలో మథనపడుతున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల వేధింపులను తట్టుకోలేక ఉద్యోగులు తమ సంఘం దృష్టికి తీసుకెళ్లి, ఆందోళన చేయాలనే విషయమై చర్చిస్తున్నట్లు తెలిసింది. వార్డుల్లో పార్టీల పరంగా చూసి సంక్షేమ పథకాలు ఇస్తే..తాము ఎలా విధులు నిర్వహించగలమని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు బదిలీల్లోనూ పారదర్శకత లేకుండా ఇష్టానుసారం చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించి, తమ విధులకు రాజకీయ ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.



దుర్గానగర్ ఆలయంలో గాయత్రి దేవి అలంకరణ



అన్నపూర్ణదేవీ అలంకారంలో కాళీమాత



ఉండవల్లి రెడ్ల రామ మందిరం వద్ద అన్నపూర్ణాదేవిగా..



ధాన్యలక్ష్మీ అలంకరణలో రాజ్యలక్ష్మీ అమ్మవారు



ఉండవల్లి అయోధ్య ప్రాంగణంలో గాయత్రీ అలంకారంలో..

సిరులిచ్చే ధనలక్ష్మీ.. ఆకలి తీర్చే అన్నపూర్ణమ్మా

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా పలు దేవాలయాల్లో మూడవ రోజు శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ధనలక్ష్మి, అన్నపూర్ణాదేవి, గాయత్రి దేవి అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

– తాడేపల్లిరూరల్/మంగళగిరి



విజయకీలాద్రిపై ధనలక్ష్మీ అలంకారంలో అమ్మవారికి పూజలు

దళితులపై ఆగని దౌర్జన్యాలు

- కూటమి ప్రభుత్వంలో నవ్యాంధ్ర రాజధానిలో దళితుడిపై వివక్ష
- టీ స్టాల్ ఓనర్‌కు వార్నింగ్ ఇచ్చిన టీడీపీ మహిళా నాయకుడి భర్త
- అతనికి గ్లాసులో టీ ఇస్తే.. తాము తాగమని హుకుం

సాక్షి ప్రతినిధి, గుంటూరు : రోజురోజుకు దళితులపై తమకు ఉన్న చిన్నచూపును టీడీపీ నేతలు పదే పదే బయట పెడుతున్నారు. నలుగురిలో వారిని చులకన చేస్తున్నారు. మంగళగిరి మండల టీడీపీ నేతలు ఓ దళితుడిని టీ స్టాల్ వద్దకు రానివ్వొద్దంటూ యజమానికి హుకుం జారీ చేశారు. ఎర్రబాలెంలో శనివారం టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి భర్త తన కుల అహంకారాన్ని ప్రదర్శించారు. బాధితుడు శాలి బంగారయ్య ఈ విషయంపై స్పందిస్తూ.. 'గతంలో నేను మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేశానని అక్కసుతో.. ఒక దళితుడు ఎట్టివాడు, శవాలు కాల్చేవాడు విగ్రహాలు ఏర్పాటు చేయడమేమిటంటూ ఎర్రబాలేనికి చెందిన టీడీపీ రాష్ట్ర మహిళా నాయకురాలి భర్త నన్ను ఎట్టిపని నుంచి తొలగించారు. అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఎర్రబాలెంలోని ఒక టీస్టాల్‌లో ఉదయం టీ తాగుతున్న సమయంలో అతను అక్కడికి వచ్చాడు. టీ స్టాల్ యజమానితో అతనికి గ్లాస్‌లో టీ ఇస్తే..మేము ఇక్కడ టీ తాగం, కులం పేరుతో వాడిని ఇక్కడకు రానిస్తే నీ షాపు ఉండదంటూ వార్నింగ్ ఇచ్చారు. నన్ను కాదులే అని నేను అక్కడి నుండి వెళ్లిపోయాను. శనివారం ఉదయం టీ తాగడానికి వెళితే టీ స్టాల్ యజమాని.. నువ్వు నా షాపు వద్దకు రావద్దు నేను నీకు టీ ఇవ్వనంటూ చెప్పాడు. నేను కూడా చేసేది ఏమీ లేక అక్కడి నుంచి వెళ్లిపోయాను. నేను నా గ్రామంలో తిరగాలంటే భయమేస్తోంది.' అని చెప్పుకొచ్చాడు.

తెనాలిలో రోడ్ల మరమ్మతులకు చర్యలు

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



మంత్రులు చంద్రశేఖర్, నాదెండ్లకు వివరిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: పట్టణంలో రోడ్ల మరమ్మతులు, మెరుగైన పారిశుద్ధ్య నిర్వాహణకు చర్యలు తీసుకోనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులపై కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చర్చించారు. కమిషనర్ బండి శేషన్న ప్రవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వాటి వివరాలు తెలియజేశారు. తెనాలి పట్టణంలోని రక్షిత మంచినీటి కనెక్షన్ల పంపిణీపై వివరాలు సేకరించారు. కనెక్షన్లు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని కమిషనర్ చెప్పడంతో అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. దీనిపై స్పందించిన మంత్రి మనోహర్ మాట్లాడుతూ నవంబర్ నుంచి పట్టణంలోని 40 వార్డులలో అడిట్ జరిపి కనెక్షన్ల పంపిణీని వేగవంతం చేయనున్నట్లు ప్రకటించారు. బుర్రిపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. అందుకు అవసరమైన స్థల సేకరణ, ఇతర పనులు చూడాలని సబ్ కలెక్టర్ సంజనా సింహకు సూచించారు. వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

పట్టణంలో పడకేసిన పారిశుధ్యం

పట్టణంలో పారిశుధ్యం పడకేసిందని, కావాల్సిన మేరకు సిబ్బంది కూడా లేరని, అధికారులు తప్పుడు లెక్కలతో మభ్యపెడుతున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఆవుల కోటయ్య ఆరోపించారు. పట్టణంలో ఖాళీ కొబ్బరి బొండాల సేకరణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ సూచించారు. ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని, బిల్లులు పెట్టటంలో జాప్యం చేయడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని టీడీపీ నాయకులు కొర్రపాటి శ్రీనివాస్ తెలిపారు. అన్ని అంశాలు నోట్ చేసుకున్నామని, వాటిని పరిష్కరిస్తామని కేంద్ర సహాయ మంత్రి హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణలో సమస్యల్ని పరిష్కరిస్తామని తెలిపారు. పట్టణంలోని కొబ్బరి బొండాల సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మున్నంగి(కొల్లిపర): యోగాలో పీజీ, డిగ్రీ, డిప్లొమా చేసిన వారు శిక్షకులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవాలని మున్నంగి ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.సాయి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మున్నంగి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్-ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో పని చేయాలని సూచించారు. నెలలో స్త్రీ యోగా శిక్షకులు 20 గంటలు, పురుష యోగా శిక్షకులు 32 గంటల పాటు తరగతులను నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి గంటలకు రూ.250 చొప్పున గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9391399194 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముఠా కార్మికుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముఠా కార్మికుడు మృతి చెందిన ఘటన ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సెక్టార్-1 పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, సీతానగర్‌లోని కేఎల్‌రావు కాలనీలో నివాసం ఉంటున్న తాతా వెంకట లక్ష్మణ్(24) వన్‌టౌన్‌లో ముఠా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ ఉదయం పని నిమిత్తం అతను తన ద్విచక్ర వాహనంపై నగరానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి బయలుదేరాడు. సీతమ్మ వారి పాదాలు సమీపానికి చేరుకోగానే వాహనం అదుపు తప్పడంతో అతను కిందపడిపోయాడు. దీంతో అతని తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆస్పత్రికి తరలి.ంచారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ప్రత్యేక గ్రీవెన్స్

తాడికొండ: తుళ్ళూరులో శనివారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌లో సమస్యలపై 200కు పైగా అర్జీలు వచ్చాయి. అధికారులు, రాజకీయ నాయకులు ఎవరూ లేకుండా ప్రత్యేకంగా ఆయన నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోగా అన్ని సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాలుగు మండలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారం చేసేందుకు తనవంతు ప్రయత్నిస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం



అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపరలో అక్రమంగా 185 క్వార్టర్ మద్యం సీసాల్ని తీసుకు వెళ్తున్న ఇద్దరిని శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర వైన్స్‌లో పని చేస్తున్న సూపర్‌వైజర్ మసికలపూడి ప్రదీప్, సేల్స్‌మన్‌గా పనిచేస్తున్న శిఖరం విజయ్ చంద్ర అనుమతి లేకుండా మద్యం సీసాలు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఏఎస్ఐ పోతురాజు, కానిస్టేబుల్ నాగబాబు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న మాగంటి హరిబాబు

తాడేపల్లిరూరల్ : అధిక వర్షాలకు పంటలు నీట మునిగి దెబ్బతిన్న కౌలు రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. శనివారం కుంచనపల్లిలో కౌలు రైతులను కలుసుకుని, పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని, నష్ట పరిహారం కౌలు రైతులకు కూడా అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన వరి పంటకు రూ.10వేలు, వాణిజ్య పంటలకు రూ.14 వేలు రైతులకు సరిపోయే పరిస్థితి లేదన్నారు. నష్టపరిహారం అందని కౌలు రైతులందరూ ఈ నెల 8న విజయవాడ మానికేని బసవపున్నయ్య ఆడిటోరియంలో జరిగే కౌలు రైతుల సదస్సుకు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. వరి పంటకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.60 వేల నుంచి రూ.1 లక్ష వరకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు, సంఘం తాడేపల్లి కాజా వెంకటేశ్వరరావు, నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, యేసయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న పాల్ దేవప్రియం పుల్లా

తాడేపల్లిరూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద క్రైస్తవులకు అందించేందుకు క్రిస్టియన్ పత్రికలు కృషి చేయాలని ఆరాధన టీవీ సీఈఓ పాల్ దేవ ప్రియం పుల్లా అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని ఈరా ఫంక్షన్ హాల్‌లో స్వర్ణ దీపిక మాస పత్రిక వార్షికోత్సవం ఎడిటర్ బెల్లంకొండ శివాజీరాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా దేవప్రియం పుల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవులందరూ ఐక్యంగా ఉండాలని, ఆధ్యాత్మిక సువార్త సేవతో పాటు సామాజిక, ఆర్థిక రంగాల్లో ప్రావీణ్యత సాధించడానికి, రాజ్యాంగ హక్కులు కాపాడుకోగల్గుతారని అన్నారు. కొడాలి విజయ్, క్రైస్తవ ధర్మపరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు జెరూసలేం మత్తయి, దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మామిడి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

'చలపతి'లో దసరా సంబరాలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కళాశాల యాజమాన్యం

తాడికొండ: మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న దసరా ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. బతుకమ్మ, కోలాటం పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు, వై.అనంతకుమారి దంపతులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. చదువుతోపాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభ వెలికి తీసేందుకు ఉపయోగపడతాయన్నారు. దసరా సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో విజేతలను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు, డీన్‌లు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ వి.వి.సుబ్బారావు, డాక్టర్ పి.బాలమురళీకృష్ణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్క ఇంటికి వెళ్లాల్సిందే

- స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించి, పేర్లు నమోదు చేయాలి
- ప్రిన్సిపల్ సెక్రటరి ఓఎస్డీ కల్యాణ్



సర్వేను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరి ఓఎస్డీ కల్యాణ్

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో జరుగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ప్రిన్సిపల్ సెక్రటరి ఓఎస్డీ కల్యాణ్ శనివారం దుగ్గిరాల గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం వివిధ రాకల వృత్తిదారులు నైపుణ్యత కనబరిచే విధంగా ప్రతిభను బయట పెట్టేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోత్సహిస్తోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే చేసేవారు ప్రతి ఒక్కరు ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంట్లో ఎంతమంది సభ్యులు ఉన్నారు. ఏఏ వృత్తుల్లో ఉన్నారు, ఏం నేర్చుకుందామనుకుంటున్నారో క్షుణ్ణంగా తెలుసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఎస్ఎస్‌డీసీ మేనేజర్ రఘు, పంచాయితీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులంతా తరలిరావాలి



రైతులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

తెనాలి: వరదలు, భారీ వర్షాలకు నష్టపోయిన కౌలు రైతులకే పరిహారం ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. కౌలురైతుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 8న విజయవాడ రాఘవయ్య పార్కు వద్ద గల మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరిగే సదస్సులో పాల్గొనాలని ఆయన కోరారు. రైతుసంఘం ప్రతినిధులు శనివారం తెనాలి రూరల్ మండలం సంగంజాగర్లమూడి, గుడివాడ, కఠెవరం గ్రామాల్లో కౌలు రైతుల్ని కలిశారు. నష్టపరిహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూయజమానులు కొందరు పత్రాలను ఇవ్వలేదనీ, ఇచ్చినవారికి కూడా పరిహారం తరతమ భేదాలతో జమయిందని కొందరు రైతులు రైతు సంఘం నేతల దృష్టికి తీసుకొచ్చారు. నష్టపరిహారం అందని కౌలురైతులు అర్జీలు తీసుకుని 8వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ తరలిరావాలని శివసాంబిరెడ్డి కోరారు. సంబంధిత కరపత్రాల్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు పిల్లి కోటేశ్వరరావు, జ్యోతుల కోటేశ్వరరావు, కర్రె గగారిన్, బండి సుధాకర్, తురకా ఏసుపాదం, ఎం.సుజాతకుమారి, సుశీల, విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం ఆవిష్కరణ

తెనాలి రూరల్: స్థానిక రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలోని శైవ సదనంలో శనివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పండిత చిలుమూరు రామలింగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ ఉపన్యాసకులు, ఆగమ శాస్త్ర పండితులు, దేవదాయ శాఖ ఆగమ సలహాదారు మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఉయ్యూరు జయప్రద, ఈఎల్‌వీ అప్పారావు, చావలి సద్యోజాతం, మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పండిత గాలి సత్యనారాయణ, పి. వినాయకరావు, దేవయజనం మురళీకృష్ణ, దీవి కృష్ణమాచార్యులు, దేవయోజనం అరుణ, సామ్రాజ్యలక్ష్మి, సీహెచ్. ఉమాదేవి పాల్గొన్నారు.